ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
21 జనవరి
2026



# నితిన్ నబీన్‌తో బీజేపీలో నవశకం

**బీజేపీ అధ్యక్షులుగా బాధ్యతల స్వీకరణ**

**45 ఏళ్లకే దేశంలో అతిపెద్ద పార్టీ సారథిగా బాధ్యతలు**

**మోదీ, నడ్డా సమక్షంలో పట్టాభిషేకం**

**తెలంగాణ బీజేపీ కార్యాలయంలో మిన్నంటిన సంబురాలు...కార్యకర్తల్లో ఉత్సాహం**

**ఇది సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం.. కుటుంబ పార్టీలకు గట్టి జవాబు: డా. బూర నర్సయ్య గౌడ్**





హైదరాబాద్, జనవరి 20 (రోమింగ్ న్యూస్): భారతీయ జనతా పార్టీ జాతీయ రాజకీయాల్లో కీలక మార్పు చోటుచేసుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బీహార్‌కు చెందిన యువ నాయకుడు, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్ నబీన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. పార్టీ రిటర్నింగ్ ఆఫీసర్, ఎంపీ డా. కే. లక్ష్మణ్ చేతుల మీదుగా నితిన్ నబీన్ నియామక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

### భాగ్యనగరంలో బీజేపీ జోష్

నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం నాంపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

### కుటుంబ పాలనకు చరమగీతం: డా. బూర నర్సయ్య గౌడ్

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు:

యువ నాయకత్వం: కేవలం 45 ఏళ్ల వయసులోనే ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఒక్క బీజేపీలోనే సాధ్యమని ఆయన కొనియాడారు.

### ప్రజాస్వామ్యానికి నిదర్శనం:

కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి పార్టీలు కేవలం కుటుంబ సభ్యులకు లేదా 'సీల్డ్ కవర్' అభ్యర్థులకు మాత్రమే పెద్ద పీట వేస్తాయని, కానీ బీజేపీలో బూత్ స్థాయి కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడయ్యే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

### తెలంగాణే లక్ష్యం

రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలో రాబోయే రోజుల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయడమే తమ తక్షణ కర్తవ్యమని, ఇదే నితిన్ నబీన్‌కు ఇచ్చే అసలైన గెలుపు కానుక అని ఆయన పిలుపునిచ్చారు.

### హాజరైన ముఖ్య నేతలు

ఈ సంబురాల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతం రావు, వేముల అశోక్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. శిల్పారెడ్డి సహా పలువురు సీనియర్ నాయకులు, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఆర్థిక భరోసా కోసమే మహిళలకు వడ్డీ లేని రుణాలు

**ఆలేరులో మంత్రి వెంకటరెడ్డి**

**సభ విజయవంతంలో ఎమ్మెల్యే బీర్ల సక్సెస్**



ఆలేరు, రోమింగ్ న్యూస్: మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఆలేరు మండల కేంద్రంలో వై.యస్.యన్ గార్డెన్స్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో కలిసి వడ్డీ లేని ఋణాల చెక్కును పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ధృఢ సంకల్పంతో గత రెండు సంవత్సరాల నుండి మెప్మా ద్వారా స్త్రీ శక్తి మరియు స్త్రీల యొక్క ఆర్థిక బలోపేతానికి కొరకై కృషి చేయుచూ ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో బాగంగా 375 మహిళా సంఘాలకు రూ.78,87,160 /-లు వడ్డీ లేని రుణాల చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరములో వివిధ బ్యాంకులు మరియు స్త్రీ నిధి వారి సహకారముతో 179 సంఘాలకు రూ.15,29,00,000/-లు బ్యాంకు లింకేజీ చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేయడం జరిగింది.ఆలేరు మున్సిపాలిటీలో 176 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలోని 1065 వీధి వ్యాపారులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.కావున మహిళా సంఘ సభ్యులు ప్రభుత్వం అందించిన లోన్లను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల వల్లే యాదగిరిగుట్ట ఆగమైంది

**ఆర్ అండ్ బీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ అవలంభించిన అనాలోచిత, అసంబద్ధ నిర్ణయాల వల్లే యాదగిరిగుట్ట పట్టణం ఆగమైందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. యాదగిరిగుట్ట పాతగుట్ట చౌరస్తా నుండి వైకుంఠ ద్వారం వరకు ఏర్పాటు చేసిన హైలెవల్ బ్రిడ్జ్ కారణంగా యాదగిరిగుట్ట పట్టణం రెండుగా చీలిపోయిందని, తద్వారా స్థానిక చిరువ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో పాతగుట్ట చౌరస్తా నుండి స్వామివారి వైకుంఠ ద్వారం వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి హైలెవల్ బ్రిడ్జ్ ను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో కాలినడకన తిరిగి బ్రిడ్జ్ ను పరిశీలించి స్థానికుల ఇబ్బందులను విన్నారు. బ్రిడ్జ్ ను తొలగించాలని, బ్రిడ్జ్ నిర్వాసితులకు ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన ప్లాట్లు, షాపులను మంజూరు చేయాలని స్థానిక వర్తక సంఘం నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జ్ తొలగింపునకు సంబంధించి ఆర్ అండ్ బీ డీఈ శ్రీనివాస్ కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో కేసీఆర్ స్థానిక ప్రజల అభిప్రాయాలు, సూచనలు తీసుకోకుండా ఏర్పాటు చేసిన బ్రిడ్జ్ వల్లే యాదగిరిగుట్ట పట్టణం అభివృద్ధికి దూరమై స్థానిక చిరువ్యాపారులు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో బ్రిడ్జ్ ఏర్పాటును వ్యతిరేకించానని, అయినా కేసీఆర్ వినకుండా బ్రిడ్జ్ నిర్మాణం చేసి స్థానికుల పొట్ట కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిడ్జ్ నిర్మాణంలో ఇండ్లు, షాపులు కోల్పోయిన బాధితులకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి ఇళ్ల స్థలాలు, దుకాణాలు ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. కచ్చితంగా బ్రిడ్జ్ నిర్మాణం కోసం ఇండ్లు, షాపులు కోల్పోయిన బాధితులను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్రిడ్జ్ ను తొలగించి స్థానిక ప్రజల ఇబ్బందులకు శాశ్వతంగా పారద్రోలి యాదగిరిగుట్ట పట్టణానికి పూర్వ వైభవం తెస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ కు మంత్రి కోమటిరెడ్డి ఫోన్ చేసి వెంటనే బ్రిడ్జ్ తొలగింపునకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సాధ్యమైనంత తొందరగా బ్రిడ్జ్ ను తొలగించి రెండుగా చీలిపోయిన యాదగిరిగుట్ట పట్టణాన్ని ఒక్కటి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చైతన్యా మహేందర్ రెడ్డి, యాదగిరిగుట్ట మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, వర్తక సంఘం నాయకుడు ముడుంబై గిరిధర్, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్, సైదాపురం మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు బిక్షపతి, మాజీ కౌన్సిలర్లు వాణీ భరత్ గౌడ్, మల్లేష్ యాదవ్, అరుణ, సరోజ తదితరులు ఉన్నారు.

# అంగనవాడీలు చిన్నారుల ఆరోగ్య, పోషణ, విద్యకు పునాదులు

**రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల ఆరోగ్య, పోషణ, విద్యకు పునాదిగా నిలుస్తాయని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన అంగన్‌వాడీ భవనాలు ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెడ్డి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రెండు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు.. రూ.4 కోట్లతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్ స్టేషన్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సదుపాయాలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ల చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్దే లక్ష్యంగా భవనాలు ఏర్పాటు చేస్తోందని, అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. అనంతరం నూతన భవనంలో చిన్నారులతో మంత్రి, ఎమ్మెల్యే ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, సర్పంచ్ రోజా, ఉప సర్పంచ్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దుంబాల వెంకట్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చైతన్యా మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

